తెలంగాణ అస్థిత్వానికే ముప్పు

- ఢిల్లీ బానిస భావాజాలానికి ప్రతీక రేవంత్‌రెడ్డి
- నాలుగున్నర కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు
- తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన బీఆర్ఎస్ నేతలు

కల్వకుర్తి, సెప్టెంబర్ 17 : కాంగ్రెస్ ప్రభుత్వం చేష్టలతో తెలంగాణ అస్థిత్వానికే ముప్పు వాటిల్లే ప్రమాదం వచ్చిందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. అమరుల త్యాగాలతో పోరాడి సాధించుకున్న తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ నేతలకు తాకట్టుపెట్టిందని దుయ్యబట్టారు. రాష్ట్ర సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి కేటాయించిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కల్వకుర్తి పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ బిడ్డల ఆత్మగౌరవంతో ఆటలాడుకుంటుందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత స్వార్థం కోసం సోనియా, రాహుల్, ప్రియాంకలను కాకాబట్టేందుకే రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సూర్యప్రకాశ్‌రావు, శ్రీను, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు జంగయ్య, బావండ్ల మధు, గణేశ్, సురేశ్, లింగం, కిశోర్, మనోహర్‌రెడ్డి, రాము ఉన్నారు.

కొల్లాపూర్ : తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కల్వకుర్తిలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు

వెల్దండ బీఆర్ఎస్ నాయకులు..

తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీలో తాకట్టు

కొల్లాపూర్, సెప్టెంబర్ 17 : సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టినట్లు బీఆర్ఎస్ కొల్లాపూర్ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు సాంబ శివుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా శ్రీనివాసులు అన్నారు. తెలంగాణ విమోచనం రోజు తెలంగాణ ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటరూరల్, సెప్టెంబర్ 17 : తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆదేశాలమేరకు మంగళవారం న్యూ బస్టాండ్ ఎదురుగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో విండో చైర్మన్ రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాంబాబునాయక్, నాయకులు అమీనోద్దీన్, కౌన్సిలర్లు రమేశ్‌రావు, అంతటిశివ, విండో డైరెక్టర్ శంకర్, ప్రవీణ్ గౌడ్, ఖాజా, నాగరాజు, కుమార్ పాల్గొన్నారు.

వెల్దండలో..

వెల్దండ, సెప్టెంబర్ 17 : తెలంగాణ తల్లి విగ్రహానికి కేటాయించిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం యావత్ తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనని బీఆర్ఎస్ వెల్దండ మండలాధ్యక్షుడు యాదగిరి అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌గౌడ్, ప్రసాద్, అంజయ్య, నిరంజన్, నర్సింహ, వెంకట్, శ్రీను, శేఖర్, రాజు పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

- ప్రజల దృష్టి మళ్లించడానికే కొత్త నాటకాలు
- పీఠం కాపాడుకోవడానికే రేవంత్ ఆరాటం
- ఉత్సవ విగ్రహంలా ఎమ్మెల్యే

కల్వకుర్తి, సెప్టెంబర్ 17 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ఇంటా, బయట తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న సీఎం రేవంత్‌రెడ్డి తన పదవిని కాపాడుకునేందుకు సోనియా, రాహుల్, ప్రియాంకల జపం చేస్తున్నాడని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఢిల్లీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాడని మండిపడ్డారు. కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, సింగిల్ విండో అధ్యక్షుడు తలసాని జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్ బుధవారం కల్వకుర్తిలో మీడియాతో మాట్లాడారు. రైతుబంధు ఇవ్వలేక, రుణమాఫీ చేయలేక, చివరకు పాడి రైతులకు పాల బిల్లులు ఇవ్వలేక సీఎం రేవంత్ పూటకోమాట మాట్లాడుతూ ప్రజలను, రైతులను వంచనకు గురి చేస్తున్నాడని దుయ్యబట్టారు. ప్రజలలోనే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి జోకర్ మాటలు మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. రూ.2లక్షల రుణమాఫీ చేశానని ముఖ్యమంత్రి చెబుతుంటే.. సంబంధిత శాఖ మంత్రితో పాటు ఇతర మంత్రులు రుణమాఫీ ఇంకా చేయాల్సి ఉందని చెబుతున్నారని, ముఖ్యమంత్రి మంత్రుల మధ్యనే సమన్వయం లేదన్నారు. ముఖ్యమంత్రి పాలన గాలికొదిలి ఉత్సవ విగ్రహాలుగా ఎమ్మెల్యేలు మారారని వారు మండిపడ్డారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కేఎల్ఐ కాల్వ తెగి 17 రోజులు దాటింది

కల్వకుర్తి నియోజకవర్గంలోని కల్వకుర్తి, వెల్దండ, అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూర్, చారకొండ, జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్, ఊర్కొండ మండలాలకు ఎంజీకేఎల్ఐ 29వ ప్రధాన కాలువ ద్వారా దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగునీరు అందుతుంది. 17 రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు కేఎల్ఐ కాల్వ మున్ననూర్ వద్ద, కల్వకుర్తి మండలం ఎలికట్ట, వెంకటాపూర్, కుర్మిద్దతో పాటు మరికొన్ని చోట్ల గండ్లు పడి తెగిపోయాయి. కాల్వలు తెగిపోవడంతో కాల్వకు వచ్చే నీళ్లు నిలిపివేశారు. ప్రస్తుతం కాల్వల కింద వరి, పత్తి తదితర పంటలు సాగవుతున్నాయి. వేరుశనగ సాగు చేసేందుకు రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కాల్వలకు గండ్లు పూడ్చకుండా ఎమ్మెల్యేలు, అధికారులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నించారు. ఈ పరిస్థితి చూస్తుంటే ఈ సీజన్‌కు సాగునీరు వచ్చేది కష్టమేనని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో హరీశ్‌రావు సాగునీటి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేఎల్ఐ పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగాయి. కానీ ఎమ్మెల్సీగా ఉన్న ఇప్పటి ఎమ్మెల్యే నారాయణరెడ్డి గొప్పతనమేమీ లేదని వారు తేల్చి చెప్పారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే 17 రోజుల కిందట కాల్వకు గండ్లు పడితే ఎందుకు పట్టించుకోలేదు, ఎందుకు కాల్వల వెంట తిరగలేదని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పాలనపై గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తించాలన్నారు.

ఎమ్మెల్యేగా గెలిచి ఇప్పటి వరకు పది నెలలు కావస్తున్నది, ఇప్పటి వరకు కూడా చెప్పుకోదగిన అభివృద్ధి ఏమీచేయలేదంటే సిగ్గుచేటని వారు దుయ్యబట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సూర్యప్రకాశ్‌రావు, శ్రీనివాసులు, తాహేర్, నాయకులు గణేశ్, సురేశ్, రాము, భగత్‌సింగ్, శ్రీధర్, లింగం, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో జిల్లా మొదటిస్థానం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 17 : అన్ని రంగాల్లో అభివృద్ధిలో నాగర్‌కర్నూల్ జిల్లా మొదటి స్థానంలో ఉందని, ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన చిన్నారెడ్డికి కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అలాగే తెలంగాణ తల్లి, మహాత్మాగాంధీ, అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని కొల్లాపూర్, తిమ్మాజిపేట కస్తూర్బా పాఠశాలల విద్యార్థినులు, తాడూరు మండలం ఇంద్రకల్ పాఠశాల విద్యార్థినుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశారు. విద్యార్థినుల ను చిన్నారెడ్డి అభినందించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే ఎస్పీ కార్యాలయం ఎదుట ఎస్పీ గైక్వాడ్ వైభవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యేలు డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, అదనపు కలెక్టర్ దేవసహాయం, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట జెండాకు సెల్యూట్ చేస్తున్న చిన్నారెడ్డి

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య

- మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి, సెప్టెంబర్ 17 : కొల్లాపూర్ నియోజకవర్గంలో రూ.80కోట్లతో సమీకృత గురుకుల పాఠశాలను నెలకొల్పనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని జటప్రోల్ గ్రామంలో సమీకృత గురుకుల పాఠశాలకు కావాల్సిన స్థలాన్ని కలెక్టర్ సంతోష్‌తో కలిసి పరిశీలించారు. సువిశాల ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసి పేద బిడ్డలకు మెరుగైన విద్య, వసతి సౌకర్యం కల్పించడంమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు.

పాఠశాల ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి

మంత్రికి దళితుల నిరసన సెగ

మంత్రి జూపల్లి కృష్ణారావుకు దళితుల నుంచి నిరసన సెగ తగిలింది. మంగళవారం మండలంలోని జటప్రోల్‌లో సమీకృత గురుకుల పాఠశాల కోసం దళితుల భూమిని ఎంచుకోవడంతో స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన మంత్రి జూపల్లి ఎదుట దళితులు తమ గోడును వెలబోసుకునేందుకు కిష్టన్న, పెంటయ్య, బాలయ్య, బాలపీరు, సంగమయ్య, శేషమ్మ, శాలయ్య, బాలయ్యలు వెళ్లారు. సర్వే నెంబర్ 508లో 8 ఎకరాల భూమిని అప్పటి జటప్రోల్ సంస్థానం అధీశులు రాజా జగన్నాథ రావు తమ సేవలను గుర్తించి ఇచ్చారని అప్పటి నుంచి తరతరాలుగా ఆ భూమిలో సాగు చేసుకొని కుటుంబాలను పోషించుకుంటున్నామని మంత్రికి తెలిపారు. కాగా మంత్రి బాధితులను నోరు మూయండని బెదరించడంతో పక్కనే ఉన్న ఆయన అనుచరులు దళితులపైకి వెళ్లారు. దీంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకొన్నది.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

కల్వకుర్తి/ఉప్పునుంతల/లింగాల/వెల్దండ/అచ్చంపేటరూరల్/బల్మూర్/తిమ్మాజిపేట/అమ్రాబాద్/ఊర్కొండ/తాడూరు, సెప్టెంబర్ 17 : కల్వకుర్తి నియోజకవర్గంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాలను ఎగురవేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పీఏసీసీఎస్ కార్యాలయంలో అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఉప్పునుంతల మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరులకు నివాళులర్పించారు. లింగాల మండలంలో తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జగన్‌మోహన్, రెవెన్యూ కార్యాలయంపై తాసీల్దార్ పాండునాయక్, మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి రామ్మోహన్‌రావు, పంచాయతీ కార్యాలయం ఆవరణలో కార్యదర్శి వీరస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వెల్దండ, అచ్చంపేట, బల్మూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. బల్మూర్ మండల పరిషత్ కార్యాలయంపై ఎంపీడీవో రాఘువులు, రెవెన్యూ కార్యాలయం ఆవరణలో డీటీ పరశునాయక్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గురుస్వామి జాతీయ జెండాను ఎగురవేశారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ప్రజాపాలన సందర్భంగా పలు కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. అమ్రాబాద్, పదర, ఊర్కొండ మండలాల్లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఎదుట జాతీయ జండాను ఆవిష్కరించారు. తాడూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, గ్రామపంచాయతీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

తిమ్మాజిపేట : రెవెన్యూ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న అధికారులు

'విశ్వకర్మల అభివృద్ధికి సహకరిస్తా'

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 17 : విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికోసం ఎల్లప్పుడు అండగా ఉంటామని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి తోడ్పడుతామన్నారు. అలాగే నాగరికతకు మూల పురుషుడు విరాట్ విశ్వకర్మ అని, ప్రతి ఒక్కరూ ఆయన సన్మార్గంలో నడవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి ఖాజా నాజీమ్‌అలీ అప్సర్ సూచించారు. మంగళవారం విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి పూజల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి

లింగాల/పెద్దకొత్తపల్లి/పెంట్లవెల్లి, సెప్టెంబర్ 17 : మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మంగారి ఆలయంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విశ్వకర్మ జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఆయన చిత్రపటాన్ని ఉంచి మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. అదేవిధంగా పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్, కల్వకోలు, చంద్రకల్, పెద్దకొత్తపల్లి గ్రామాల్లో విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మం ఆలయంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ స్వామి జయంతి ని భక్తిశ్రద్ధతో నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు మురళీచారి, పెంట్లవెల్లి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌చారి, మాజీ ఎంపీటీసీ సుమలత శేషు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

కొల్లాపూర్/కల్వకుర్తిరూరల్/కోడేరు/ పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 17: కొల్లాపూర్ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఎదుట జాతీయ జెండాను ఎగరవేయడంతో పాటు, మొక్కలను నాటి పర్యావరణ ప్రముఖ్యత గురించి వివరించారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆర్డీవో నాగరాజు జెండా విష్కరణ చేయగా, కొల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ చైర్‌పర్సన్ రమ్య జాతీయ జెండాను ఎగరవేశారు. అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలోని తాసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే కల్వకుర్తి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ నాయకులు జాతీయ పతాకావిష్కరణ చేసి తెలంగాణ విమోచన దినాన్ని జరుపుకొన్నారు. అదేవిధంగా కోడేరు మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలపై అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంపై ఎంపీడీవో శ్రావణ్‌కుమార్, రెవెన్యూ కార్యాలయంపై తాసీల్దార్ విజయ్‌కుమార్, విండో కార్యాలయంపై చైర్మన్ చిన్నారెడ్డి, పోలీసుస్టేషన్‌పై ఎస్సై గోకారి జాతీయ జెండాలను ఎగురవేశారు.

కొల్లాపూర్ : ఆర్డీవో కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగరవేసిన ఆర్డీవో నాగరాజు

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో నాగేందర్, రెవెన్యూ కార్యాలయం వద్ద జెండాను ఎగరవేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

- ఎంపీడీవో వెంకటయ్య

అమ్రాబాద్, సెప్టెంబర్ 17 : పరిసరాలను మనమందరం పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎంపీడీవో వెంకటయ్య అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ జెండావిష్కరణ చేశారు. అనంతరం స్వచ్ఛతాహి సేవా 2024 పక్షోత్సావాలను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా స్త్రీ శక్తి భవనం సమీపంలో మొక్కలు నాటి మొక్కలను కాపాడుకుందామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందమని ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి మల్లేశ్, ఏపీవో రఘు, ఏపీఎం రాంరెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు

బిజినేపల్లి, సెప్టెంబర్ 17: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం గ్రామంలో బాలాజీ గార్డెన్స్‌లో 80 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కతాలప్ప, ఏవో నీతి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, FAISAL BIN MOHSIN AL AUBASANI, S/o MOHSIN BIN HASAN R/o H.No:1-5-29/1/A, Hashmi Street, Newtown , Mahabubnagar Town and Dist Mahabubnagar T.G., hereby declare that I, have changed my name from FAISAL BIN MOSIN (old name) to FAISAL BIN MOHSIN AL AUBASANI S/o MOHSIN BIN HASAN (new name).

NT-MBNR

CHANGE OF NAME

★ I, NEMATHUNISSA BEGUM, R/o. 2-9-36, Market Road Clock Tower, Mahbubnagar-509 001, T.S. I have Changed My Name as "NEMATH UNNISA, W/o. Mohammad Yousuf".

NT-335814

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.

NT-331771-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

108లో ప్రసవం : తల్లీ బిడ్డా క్షేమం

ఊర్కొండ, సెప్టెంబర్ 17 : పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించిన ఘటన మండలంలోని తిమ్మన్నపల్లి గేట్ సమీపంలో చోటు చేసుకున్నది. అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు మండలంలోని రేవల్లి గ్రామానికి చెందిన మంజుల మంగళవారం పురిటి నొప్పులు వస్తుండడంతో ఆమె భర్త శివకుమార్ 108కి కాల్ చేశాడు. వెంటనే అక్కడికి చేరుకొని కల్వకుర్తిలోని దవాఖానకు తరలిస్తుండగా తిమ్మన్నపల్లి గేట్ వద్దకు రాగానే మంజులకు పురిటి నొప్పులు తీవ్రం కావడంతో 108 సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ వరప్రసాద్, పైలట్ అశోక్ ప్రసవం చేశారు. మంజుల ఆడ బిడ్డకు జన్మనివ్వగా తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం వారిని కల్వకుర్తి దవాఖానకు తరలించారు.

శిశువును అప్పగిస్తున్న మెడికల్ టెక్నీషియన్ వరప్రసాద్

తాసీల్దార్‌కు సన్మానం

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 17 : తిమ్మాజిపేట తాసీల్దార్‌గా బదిలీపై వచ్చిన రామకృష్ణయ్యను మంగళవారం రేషన్ డీలర్లు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన డీలర్లతో సమావేశమై రేషన్ కార్డుల వివరాలను, బియ్యం సరఫరా గురించి చర్చించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

అచ్చంపేటరూరల్, సెప్టెంబర్ 17 : నాటి తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కేంద్రంలోని బీజేపీ వక్రీకరించి విష ప్రచారం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దేశ్యానాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో అమరుడు కామ్రేడ్ సీతారం ఏచూరి ప్లెక్సీ వద్ద తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ గొప్ప చరిత్ర కలిగిన తెలంగాణ సాయుధ పోరాట ఘటాన్ని ముస్లిం రాజులపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మల్లేశ్, నాగరాజు, నాయకులు రాములు, వివకుమార్, సయ్యద్, నిర్మల, వాల్యా, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, సెప్టెంబర్ 17: తెలంగ